క్లుప్తంగా

రేపు వైకల్య నిర్ధారణ శిబిరం

మంథని: జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత పరికరాల కోసం ఈనెల 3న వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి దాసరి లక్ష్మి తెలిపారు. మంథని మండలంలోని 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2 ఫొటోలు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డుతో రావాలని సూచించారు.

మడేలేశ్వరస్వామి ఆలయంలో చోరీ

ఓదెల: మడక గ్రామంలోని మడేలేశ్వరస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి గుడిలోని తలుపులు పగలగొట్టి 2 పెద్ద దీపాలు, గంటను దొంగలించారు. కరెంట్ బోర్డును ధ్వంసం చేశారు. పొత్కపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తప్పుడు వార్త రాసిన జర్నలిస్టు అక్రిడేషన్ రద్దు

పెద్దపల్లిరూరల్: తప్పుడు వార్తలు రాసిన జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు రద్దు చేసినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ముత్తారం మండలానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి కె.మల్లేశ్ యాదవ్(ప్రస్తుతం వేరే దిన పత్రికలో పని చేస్తున్నారు) ఖమ్మంపల్లి టు హైదరాబాద్, అక్రమ మట్టి రవాణా, రూ.కోట్లు సంపాదిస్తున్న స్థానిక నాయకులు అనే వార్తపై విచారణ జరిపామన్నారు. ఆ కథనం పూర్తి అవాస్తమని తేలిందని అన్నారు. ఖమ్మంపల్లిలో ప్రభుత్వ భూముల్లో నుంచి జెడ్పీ హైస్కూల్ అవసరాల కోసం అధికారుల అనుమతితోనే తరలించినట్లు విచారణలో తేలిందన్నారు. సంబంధిత జర్నలిస్టు డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని అన్నారు. అక్రిడేషన్ కార్డు నిబంధనల ప్రకారం ఓ సంస్థ నుంచి పొందిన కార్డును వేరే సంస్థకు మారిన నేపథ్యంలో రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. తప్పుడు వార్తలు ప్రచురిస్తున్న నేపథ్యంలో సదరు జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు రద్దు చేస్తున్నామని, 2 రోజుల్లోగా బస్‌పాస్, అక్రిడేషన్ కార్డు డీపీఆర్‌వో ఆఫీసులో సరెండర్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ధర్మారం: మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి వస్తున్నట్లు మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. మండలంలోని ప్రతీ రెవెన్యూ గ్రామానికి యూరియా స్టాకులు కేటాయించి షెడ్యూల్ ప్రకారంగా సరఫరా చేస్తామన్నారు. పత్తిపాక సింగిల్‌విండో పరిధిలో పత్తిపాక, కమ్మరిఖాన్‌పేట, మల్లాపూర్, నర్సింగాపూర్ రెవెన్యూ గ్రామాల రైతులకు యూరియాను అందిస్తామన్నారు. నందిమేడారం సింగిల్‌విండో పరిధిలో నందిమేడారం, సాయంపేట రెవెన్యూ గ్రామ రైతులకు యూరియా అందుబాటులో ఉంటుందని అన్నారు. ధర్మారంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో కొత్తూరు, కటికనపల్లి, చామనపల్లి రైతులకు, సీఏస్‌సీ ధర్మారం కేంద్రంలో బొమ్మారెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాల రైతులకు, డీసీఎంఎస్ దొంగతుర్తి దుకాణంలో దొంగతుర్తి, కానంపెల్లి, బొట్లవనపర్తి, ఖిలావనపర్తి రైతులకు, డీసీఎంఎస్ రామయ్యపల్లిలో పైడిచింతలపల్లి, రచ్చపల్లి రెవెన్యూ గ్రామాల రైతులకు యూరియా అందుబాటులో ఉంటుందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: రంగంపల్లిలోని సెంట్ ఆన్స్ పాఠశాలలో సోమవారం షీటీం సభ్యులు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై వేధింపులు తదితర అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. షీ టీం బృందాలు నిరంతరం గస్తీ తిరుగుతుంటాయన్నారు. మౌనిక, సురేశ్, స్నేహలత తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక

గోదావరిఖనిటౌన్: రామగుండం కార్పొరేషన్ నాయీ బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడిగా మందపెల్లి సతీశ్, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో రూ.8లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు సోమవారం పనులను ప్రారంభించారు. ఎంపీవో మారుతి, నాయకులు భూంపెల్లి రాజయ్య, కుమార్, శంకర్, నరేశ్ ఉన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జ్యోతినగర్: గ్రంథాలయాలను వినియోగించుకొని విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు ప్రమీల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గంటగంటకూ మేల్కొలుపు.. భక్తిభావం పెంపు



జూలపల్లి గ్రామం



బస్టాండ్ వద్ద లౌడ్ స్పీకర్లు



శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రసారం చేసే యూనిట్

- జూలపల్లిలో దాతల సహకారంతో వాడవాడన లౌడ్ స్పీకర్లు
- శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రసారం
- ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు..

జూలపల్లి: ఆ గ్రామంలో గంటగంటకు భక్తి శ్లోకాలతోపాటు సమయం లౌడ్ స్పీకర్ల ద్వారా వాడవాడన వినిపిస్తుంది. ప్రజల్లో భక్తిభావం పెంచి చైతన్యవంతులను చేయడం, గ్రామంలో అవసరమైన పనులకు సంబంధించిన వివరాలను ప్రజలకు స్పీకర్ల ద్వారా వినిపించి అప్రమత్తం చేసేందుకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. స్థానిక శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక గదిలో ఏర్పాటు చేసిన అంప్లిఫైర్ ఎలక్ట్రానిక్ వ్యవస్థ ద్వారా గంటగంటకు భక్తి శ్లోకాలతోపాటు సమయాన్ని ప్రజలకు వివరిస్తూ అప్రమత్తం చేస్తోంది. దీంతో తాము సమయం ప్రకారం చేసే పనులను గుర్తు చేసినట్లవుతోందని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.

దాతల సహకారంతో..

శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేసిన తర్వాత అందరి సహకారంతో ఆలయ ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసి ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో పలు అభివృద్ధి పనులను చేస్తూనే గ్రామంలోని ప్రజల్లో భక్తిభావం పెంచేందుకు దాతల సహాయంతో వాడవాడలా స్పీకర్లను ఏర్పాటు చేసి భక్తి శ్లోకాలతోపాటు సమయం ప్రసారం చేయాలన్న నిర్ణయానికి దాతల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో గ్రామంలో వాడవాడలా రూ.5.80లక్షల నిధులతో 18 లౌడ్ స్పీకర్లు బిగించి ఆటోమేటిక్‌గా ప్రసారం చేసే వ్యవస్థను ఆలయంలోని ప్రత్యేక గదిలో బిగించారు. దీంతో ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు గంటగంటకు ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉంటుంది. ఇలా ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏర్పాటు చేసి వ్యవస్థ బాగుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి వ్యవస్థను ఇతర గ్రామాల్లో సైతం ఏర్పాటుకు ఆయా గ్రామాల దాతలు పరిశీలన చేస్తున్నారు.

భక్తిభావం పెంచడమే లక్ష్యం



ప్రజల్లో భక్తిభావం పెంచాలన్న లక్ష్యంతో గ్రామంలో వాడవాడలా భక్తి శ్లోకాలతో కూడిన సమయాన్ని తెలియజేయడంతోపాటు ఇతర కార్యక్రమాలను సైతం ఇక్కడి నుంచి ప్రజలకు వివరించొచ్చు. ఈ వ్యవస్థ ఏర్పాటుకు దాతల సహకారం మరువలేనిది.

– పొట్టాల మల్లేశం, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత అన్నపూర్ణ కాలనీలోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. 2 సంవత్సరాల క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీని రోడ్డును తవ్వి నిర్మించారు. రోడ్డు వేయకపోవడంతో వర్షం కురిస్తే బురదగా మారి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





అబ్బ అద్దం.. నా అందం చూసుకుంట..



బావ.. నేను ఎట్లున్న..



చూడు.. నా ముఖం ఎంత అందంగా ఉందో..

నా అందం చూడు బావయ్యో..

ఈ చిత్రాలు చూస్తుంటే.. నా అందం చూడు బావయ్యో అంటూ ఓ ఆడ పిచ్చుక మగ పిచ్చుకను అడుగుతున్నట్లు ఉంది కదూ.. అవును నిజమే. మంథని మున్సిపల్ పరిధిలోని సావిత్రీబాయి పూలేకాలనీలో ఓ ట్రాక్టర్‌కు ఉన్న అద్దంలో ఇలా ఆడ పిచ్చుక తన అందాన్ని చూసి మురిసిపోతూ మగ పిచ్చుకకు చెప్తోంది. ఈ దృశ్యాలను సోమవారం సాక్షి తన కెమెరాలో బంధించింది.

– మంథనిరూరల్



చెప్పు బావ.. ఎలా ఉన్నానో..



ఎందుకు బావ.. ముఖం అటు పెట్టుకున్నవ్..

ఓటరు జాబితాలో అవకతవకలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఓటరు జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి పెద్దపల్లి ఆర్డీవోకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. పాత మడిపెల్లి గ్రామంలో జనాభా 414 అని నమోదు చేయగా.. ఓటర్లు 439 మందిగా ఓటరు జాబితాలో పొందుపరచడం అధికారుల తప్పిదాలను రుజువు చేస్తోందన్నారు. మాజీ సర్పంచులు ఆడిగొప్పుల రాణిమోహన్, తీగల స్వప్న నాగరాజు, బుర్ర సదానందం, ఎంపీటీసీలు కొల్లూరి రమాదేవి రాయమల్లు, మాదాసు సువర్ణ చందు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సంపత్‌యాదవ్, తిరుపతిరెడ్డి



ఓదెల: కొలనూర్‌లో సోమవారం అయ్యప్ప గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపయ్యకు 51 నైవేద్యాలు సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

హామీలు అమలు చేయాలి

జూలపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ ఆధ్వర్యంలో జూలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. జ్యోతిబసు, సంకెన్ల నర్సయ్య, సంతోష్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గన్ను వెంకటరెడ్డి, బొజ్జ సంపత్, పొన్నం వెంకటేశ్, లక్కాకుల రమేశ్, ఒగ్గు మల్లేశం, ఎర్రోల్ల రాములు, దాడి రవి, సంపత్‌రెడ్డి తదితరులున్నారు.

బిల్లులు విడుదల చేయాలి

రామగుండం: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యా రాణి డిమాండ్ చేశారు. అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచాక ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆ మాటను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. నాయకులు బోడకుంట సుభాష్, మేర్గు నరేశ్, ఊరగొండ అపర్ణ, కుడుముల సంజీవ్, చిలువేరు అంజి, సంతోష్, గంగరాజు, నాగరాజు, సుదమల్ల రమేశ్, మాదరబోయిన రాకేశ్, ఆలకుంట మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నాయకుల ధర్నా

బీజేపీ నాయకుల అరెస్టు

ఎలిగేడు: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయాలని బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపునివ్వగా.. ఎస్సై సత్యనారాయణ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గాదె రంజిత్‌రెడ్డి, గర్రెపల్లి నారాయణస్వామి, కొత్తిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, అడ్డగుంట తిరుపతిగౌడ్, రాయపాక మనోహర్ తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనానికి యత్నిస్తారనే ముందుస్తు సమాచారం మేరకు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు. మాజీ ఎంపీటీసీలు శంకరాచారి, జనార్దన్‌రెడ్డి, నాయకులు మహేందర్, చంద్రమౌళి, రాంరెడ్డి తదితరులున్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శ్రీనిధి మాథ్స్ అండ్ సైన్స్ టాలెంట్ క్విజ్ పరీక్షలో మండలస్థాయి రెండో స్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి హెచ్‌ఎం అంజయ్య తెలిపారు. ఈనెల 3న జరిగే జిల్లాస్థాయి టాలెంట్ పరీక్షలో పాల్గొంటుందన్నారు. విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు.

క్రీడల్లో రాణించాలి

ఎలిగేడు: ప్రతీ ఒక్కరు క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాణించి మంచి గుర్తింపు తేవాలని ఎంఈవో నరేంద్రచారి అన్నారు. సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం భారత పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవో ప్రారంభించారు. ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి పీఏ జైపాల్‌రెడ్డి తండ్రి ఇటీవల మరణించగా.. సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం తిర్మలాపూర్ గ్రామంలో నివాళి అర్పించారు.

నిబంధనలకు విరుద్ధంగా కడితే చర్యలు

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు కడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జె.అరుణశ్రీ స్పష్టం చేశారు. సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

మంథని: మంథని ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రిని సందర్శించి సమస్యలడిగి తెలుసుకున్నారు. బూడిద గణేశ్, అర్ల సందీప్, గొర్రెంకల సురేశ్, మంథని లింగయ్య పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఆర్జీవన్ ఏరియాలో 114 శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ ఏరియాలో ఆగస్టులో 114 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి, సంక్షేమ కార్యక్రమాలపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆగస్టులో 2.93లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3.33లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి 18.07లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 15.94లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల్లో 88 శాతంలో నిలిచినట్లు పేర్కొన్నారు. మూతబడిన మేడిపల్లి ఓసీపీలో 500 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజ్ ప్లాంట్ ఫిజిబులిటీ, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు వాప్కో కంపెనీ ద్వారా కొనసాగుతోందన్నారు.

ఆగస్టులో లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. గతనెలలో 5.78లక్షల టన్నుల లక్ష్యానికి గాను 6.44లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యానికి మించి 111 శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. 39లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీతకు గాను 43.41లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి 111 శాతం సాధించినట్లు వివరించారు.

రామగిరి: ఆగస్టులో ఆర్జీ–3లో 88 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు సోమవారం జీఎం నరేంద్ర సుధాకర్‌రావు తెలిపారు. ఆర్జీ–3లో నిర్దేశించిన 4.40 లక్షల టన్నులకు గాను 3.87లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, నిర్దేశించిన ఓబీ మట్టి వెలికితీత 9.50లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 17.90లక్షల క్యూబిక్ మీటర్లు(188 శాతం) వెలికితీయడం, 5.23లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ఏపీఏ గనిలో ఆగస్టులో 8 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. ఆగస్టులో నిర్దేశించిన 1.60లక్షల టన్నులకు గాను 0.12లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు.

పర్యావరణహిత గని పురస్కారం అందుకున్న ఓసీపీ–1



ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుకు పురస్కారం అందిస్తున్న అధికారులు

రామగిరి: సింగరేణి సంస్థ నిర్వహించిన 55వ భద్రత వారోత్సవాల్లో ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1 ఉపరితల గని సింగరేణి సంస్థలో ఉత్తమ పర్యావరణహిత గని, సీహెచ్‌పీ తృతీయ పురస్కారానికి ఎంపికైంది. పురస్కారాన్ని ఆదివారం శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉన్నతాధికారుల చేతుల మీదుగా గని తరపున ఓసిపి–1 ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, పర్యావరణ అధికారి కె.కిషన్, సీహెచ్‌పీ తరపున డీజీఎం కాశీవిశ్వేశ్వరరావు అందుకున్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారాన్ని ఆర్జీ–3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్‌రావుకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ సంఘాల నిరసన

కాల్వశ్రీరాంపూర్: ఉపాధ్యాయ జేఏసీ, టీపీఆర్ఎంఈఏ కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ముత్తారం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయలని ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎంపీడీవో సురేశ్, జీఎల్ఎస్‌రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.



తారుపల్లి జెడ్పీ హైస్కూల్లో నిరసన తెలుపుతున్న నాయకులు

కమాన్‌పూర్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీడీవో లలిత, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, ఎంపీవో మారుతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జూలపల్లి: ఆదర్శ విద్యాలయాల్లో 11 సంవత్సరాలుగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయం ప్రిన్సిపాల్ షాదుల్‌కు వినతిపత్రం అందజేశారు. 6 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకే ఈనెల 2 నుంచి విధులకు గైర్హాజరౌతున్నామన్నారు. పిడి నాగరాజు, కంప్యూటర్ ఆపరేటర్ సంతోష్, సంకెన్ల లక్ష్మిరాజం అటెండర్, వాచ్‌మెన్ రమేశ్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది, కష్టమర్లకు వైద్య సేవలతోపాటు అవసరమైన పరీక్షలను ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేశ్ బీరకాయల నిర్వహించారు. షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగ నిర్ధారణ చేశారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడారు. ఎల్ఐసీ మేనేజర్ మల్లేశ్, ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, యూనస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌లో..

ఎలిగేడు: టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా సుల్తాన్‌పూర్‌లోని జీపీ కార్యాలయంలో సోమవారం టీబీ ఎక్స్‌రే క్యాంపును మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. 135 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీవో కిరణ్, సూపర్‌వైజర్లు నాగమణి, లక్ష్మణ్, ఏఎన్ఎంలు సులోచన, జ్యోష్నరాణి, ఆశ కార్యకర్తలు లక్ష్మి, పద్మ, సృజన, పంచాయతీ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం

గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 5 వరకు ప్రభుత్వ పీజీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ జాతీయ సేవాపథకం సమన్వయకర్త ఇనుగాల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి పర్సనల్ అధికారి రవీందర్‌రెడ్డి, విక్టర్, జార్జ్, న్యాయవాది పెద్దెల్లి ప్రకాశ్, పలు కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు యాట ప్రసాద్, సాంబశివరావు, కిరణ్మయి, నరేశ్, దామెరకొండ శంకర్, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్

చెత్త కుప్పల తొలగింపు

జ్యోతినగర్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గౌతమినగర్ కంపోస్టు యార్డులో వేస్ట్ టూ ఆడిట్ నిర్వహించారు. అనంతరం క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్‌గా గుర్తించిన మల్కాపూర్ చెరువు శిఖంలో కొన్నాళ్లుగా కుప్పలుగా నిలిచి ఉన్న చెత్త కుప్పలను జేసీబీతో తొలగించి చదును చేశారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పర్యవేక్షించగా.. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు రంగు నాగభూషణం, సంపత్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

మురుగు నీరు మళ్లింపు



సాక్షి స్పందన

రామగుండం: శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రధాన డ్రైనేజీ శిథిలావస్థకు చేరి మురుగు నీరంతా రహదారిపైకి చేరుతోంది. సాక్షి దినపత్రికలో ప్రచురితమవగా.. కార్పొరేషన్ పారిశుధ్య అధికారులు స్పందించి మురుగు నీటిని మళ్లించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. సోమేశ్‌కుమార్, విజయ్ తదితరులున్నారు.